క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


మాట్లాడుతున్న సీఐ మహేశ్వర్

నగరి: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఐ మహేశ్వర్ సూచించారు. శనివారం ముడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు రౌడీ మూకల నుంచి ఎలా రక్షణ పొందాలో వివరించారు. మహిళా పోలీసులు అందుబాటులో ఉంటారని, ఏదైనా ఆపద సంభవిస్తే వెంటనే వారికి సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థినుల వేషధారణ చక్కగా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు


పీబీ అగ్రహారంలో గోకులం షెడ్డు పరిశీలన

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని ఎస్ఎస్ కొండ ఎట్టేరి పశు వైద్యశాలను, పీబీ అగ్రహారంలో కొత్తగా నిర్మించిన గోకులం షెడ్‌ని శనివారం జిల్లా పశువైద్యశాఖ జేడీ ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ జాతీయ పశుగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు ఏడీ డాక్టర్ మురళీమోహన్, ఎట్టేరి పశు వైద్య అధికారి నాగాంజనేయులు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆర్టీఐ అసోసియేషన్ సభ్యుడికి సన్మానం


దేవరాజులును సత్కరిస్తున్న నేతలు

వెదురుకుప్పం: సమాచార హక్కు కార్యకర్తల సంఘం యాక్టివ్ మెంబర్‌గా నియమితుడైన పచ్చికాపల్లం గ్రామానికి చెందిన పి.దేవరాజులుని శనివారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు ఎం.రామయ్య, సీనియర్ నాయకుడు శివాజీ ఆధ్వర్యంలో పూలమాల వేసి, పండ్లు, స్వీట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవరాజులు మాట్లాడుతూ ప్రజల గొంతుకై నిలబడి వారి సమస్యలపై పోరాటాలకు తాను కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాతగుంట మాజీ సర్పంచ్ గోవిందన్, నాయకులు జాకబ్, విక్కీ, ఉపాధ్యాయుడు చలపతి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


రోగులకు పండ్లు అందజేస్తున్న విలేకరులు

వెదురుకుప్పం: జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోని రోగులకు జర్నలిస్టులు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు వెదురుకుప్పంలో వివిధ సమస్యలపై ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలకు చెందిన విలేకరులు పాల్గొన్నారు.

ప్రజలు-ప్రభుత్వానికి వారధి మీడియా


కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ సుమన్

శ్రీరంగరాజపురం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా అని ఎస్ఐ సుమన్ అన్నారు. మండల కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ పత్రికా దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడంలో, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేయడంలో మీడియా ఎంతో కీలకమని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్నా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి, పరిష్కార మార్గాన్ని చూపించడంలో మీడియా కృషి ఎనలేనిదని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, మీడియా మిత్రులను సన్మానించారు. అనంతరం మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కృషి చేయాలన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయాలన్నారు.

- 18 ఏళ్లు నిండాయా... ఓటరుగా నమోదు చేసుకోండి
- ఓటరు లిస్టులో తప్పొప్పులను సరిచేసుకోండి
- ఈ నెల 23, 24 చివరి అవకాశం
- ఆయా పోలింగ్ స్టేషన్ల వద్దే స్పెషల్ రివిజన్

అవకాశమిదే... వినియోగించుకోండి


బీఎల్ఓలకు సూచనలిస్తున్న కమిషనర్ మంజునాథ్‌గౌడ్(ఫైల్)

పుత్తూరు: సార్వత్రిక ఎన్నికలు జరిగి ఆరుమాసాలు గడవక ముందే కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శక ఓటర్ల జాబితాతోపాటు ఓటరు నమోదు ప్రక్రియపై మరోసారి దృష్టి సారించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్-25లో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ముందుగా బీఎల్ఓలను ఇంటింటికీ పంపి నూతన ఓటర్ల వివరాలతో పాటు ప్రస్తుతం ఉన్న ఓటర్లకు సంబంధించి మార్పులు, చేర్పులపై సర్వే చేయించింది. సర్వే అనంతరం గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించేందుకు అక్టోబర్ 29 నుంచి నవంబరు 24 వరకు ఎలక్షన్ కమిషన్ అవకాశం కల్పించింది. ఇందుకు అనుగుణంగా నవంబర్ 24వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉండి క్లెయిమ్స్‌తో పాటు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్‌లో వచ్చిన అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీ లోపల పరిష్కరించి, 2025 జనవరి 6వ తేదీన ఫైనల్ పబ్లికేషన్ చేయనున్నారు.

విధులను విస్మరిస్తున్న బీఎల్ఓలు

జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా బీఎల్ఓలు తమ విధులను విస్మరిస్తున్నారు. నవంబర్ నెలలోని ప్రతి శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు నిర్వహించాలని, ఇందులో ఫామ్ 6, 7, 8 స్వీకరించాలని మార్గదర్శకాలను సూచించింది. అయితే బీఎల్ఓలు తమ విధులను నామమాత్రంగా నిర్వహించడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచే బీఎల్ఓలు పోలింగ్ స్టేషన్ల వద్ద కనిపించడం లేదని, ఆదివారం అయితే అసలు రానేలేదని చెబుతున్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో కీలకమైన స్పెషల్ క్యాంపెయిన్‌కు సాదాసీదాగా ముగింపు పలుకుతున్నారు. పుత్తూరు మండలంలో 58,637 మంది ఓటర్లు ఉండగా కేవలం 243 అప్లికేషన్లు మాత్రమే రావడం ఇందుకు నిదర్శనం. ఇందులోనూ తొలిసారి ఓటు హక్కు పొందేందుకు 18 ఏళ్లు నిండిన వారు ఫామ్-6 కింద 58 అప్లికేషన్లు సమర్పించారు. చనిపోయిన వారు, ఊరు మారిపోయిన వారి పేర్లు తొలగించుకోవడం కోసం ఫామ్-7 కింద కేవలం 46 అప్లికేషన్లు రాగా, పేర్లు, డోర్, ఫోన్ నెంబర్లు తప్పుగా ఉంటే సవరణల కోసం ఫామ్-8 కింద 139 మాత్రమే వచ్చాయి. 58 వేలకు పైగా ఓటర్లు ఉండగా కనీసం మూడు వందల మార్కును సైతం అందుకోలేక పోయారంటే బీఎల్ఓల పనితీరుకు అద్దం పడుతోంది.

విధులకు హాజరు కాకపోతే కఠిన చర్యలు



బీఎల్ఓలు విధిగా శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద విధులు నిర్వహించాలి. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించి అప్లికేషన్లు స్వీకరించాలి. విధులకు రానివారిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, తగిన చర్యలు తీసుకుంటాం.

–మంజునాథ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

నేడు విస్తృతంగా సేవా కార్యక్రమాలు


ఆర్కే రోజా

నగరి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం నియోజకవర్గవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఉదయం 10 గంటలకు నగరిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, నగరి మున్సిపాలిటీల నాయకులు, అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది.

క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ


విచారణ నిర్వహిస్తున్న వీఆర్ఓ

నగరి: కీళపట్టు గ్రామ పరిధిలోని క్వారీ, మైన్స్ నిర్వహణకు సంబంధించి జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక వీఆర్ఓ శనివారం గ్రామంలో విచారణ చేపట్టారు. క్వారీ ఏర్పాటు సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, క్వారీలో పేల్చుతున్న బాంబులు, వాయు కాలుష్యం ప్రజలు, పశువులకు ప్రాణాంతకంగా మారాయని జేసీకి గ్రామస్తులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జేసీ ఆదేశాల మేరకు గ్రామంలోని పురుషులు, మహిళలతో విడివిడిగా సమాచారం సేకరించారు. నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వీఆర్ఓ తెలిపారు.

ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న మీనాకుమారి, విద్యార్థులు

పుత్తూరు: విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖులైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, పోతూరి నాగభూషణం, ఆర్.రంగనాథంలను ఆదర్శంగా తీసుకోవాలని లైబ్రేరియన్ మీనాకుమారి సూచించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం లైబ్రరీలో ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి వారు చేసిన కృషిని వివరించారు. విద్యార్థులు, యువత తరచూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించవచ్చునన్నారు. తద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

వెదురుకుప్పం: చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటసుబ్బయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలికలపై అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలు అధికమవుతున్న క్రమంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ నిర్మల, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పుత్తూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2024-25 ఏడాదికి గాను ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణా తరగతులను శనివారం ఎంపీపీ మునివేలు ప్రారంభించారు. ఎంపీడీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ శిక్షణా తరగతులను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఈ ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ కిషోర్‌కుమార్, అన్ని శాఖల ఏఈఈలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వెదురుకుప్పం: మండలంలోని గొడుగుచింత గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ నక్కాబాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించి దిబ్బలను తీసివేశారు. చెత్తా చెదారాన్ని శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. ఇళ్ల వద్ద వృథా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరేష్, వీఆర్ఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మందుబాబుల హల్‌చల్

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం హైస్కూల్ గ్రౌండ్, కోదండరామాపురం సాగు భూముల్లో మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. కొందరు సీసాలను గ్రౌండ్‌లో పగల కొడుతున్నారు. విద్యార్థులు గ్రౌండ్‌లో ఆడుకునేటప్పుడు పగలగొట్టిన సీసా పెంకులు గుచ్చుకుని గాయాల పాలవుతున్నారు. రెండు రోజుల క్రితం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి గ్రౌండ్‌లో మద్యం సీసాలు, పగిలిన సీసాలను తొలగించి, శుభ్రం చేశారు. ఒక రోజు కూడా గడవక ముందే మందు బాబులు మద్యం సీసాలను పగలగొట్టి పడేశారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోదండరామాపురం చిన్నబ్బరాజు భూమిలో మద్యం తాగి, ప్లాస్టిక్ కవర్లు, సీసాలను పగలగొట్టి వెళ్లిపోతున్నారు. గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్‌షాపులు ఎక్కువగా ఉండడంతోనే ఇలా జరుగుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోదండరామాపురంలో సాగు భూమిలో పడేసిన మద్యం సీసాలు, తిరుమలరాజుపురం హైస్కూల్‌లో..

రేపటి నుంచి మహా సంప్రోక్షణ పూజలు

వెదురుకుప్పం: చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో సోమవారం నుంచి మహా సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ పూజలకు సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆలయానికి పెయింటింగ్ వేయించి శోభాయమానంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు.

సివిల్ సప్లయిస్ అధికారుల తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు రేషన్ కంది పప్పుపై ఆకస్మిక తనిఖీలు చేశారు. సాక్షి దినపత్రికలో సోమవారం రేషన్ కంది కొక్కులు అనే శీర్షికన కథన ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ప్రజల నుంచి వివరాలు సేకరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శ్రీరంగరాజపురం: మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ సరిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఉంటుందని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కో-ఆప్షన్ మెంబర్, అధికారులు పాల్గొనాలని కోరారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అమర్‌నాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

వడమాలపేటలో ఆధార్ సెంటర్

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలో ఈ నెల 19 నుంచి 22 వరకు, 26 నుంచి 29వ తేదీ వరకు ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు శనివారం తెలిపారు. వడమాలపేట , చుట్టు పక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏఓగా మధువాణి



పాలసముద్రం: మండల పరిషత్ కార్యాలయానికి నూతన ఏఓగా శనివారం మధువాణి బాధ్యతలు చేపట్టారు. ఆమె జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై పాలసముద్రం ఏఓగా వచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చేస్తామన్నారు.

దొరస్వామిరెడ్డికి మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ


దొరస్వామిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామానికి చెందిన ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి తండ్రి దొరస్వామిరెడ్డి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొంది శనివారం ఇంటికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కొల్లాగుంట గ్రామానికి చేరుకుని దొరస్వామిరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్ సీపీ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట మండల కో-ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుష్పమునికృష్ణ, గాంధీ తదితరులు ఉన్నారు.

భూమనతో దయాసాగర్‌రెడ్డి భేటీ


జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న దయాసాగర్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరుణాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ దొరస్వామి, ధనుంజయ రెడ్డి, చక్రవర్తినాయుడు, గోవిందరెడ్డి, నరసింహారెడ్డి, ముని, ఎర్రపండు, ఇరగంరెడ్డి, భూపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి


పోలీసులకు సూచనలిస్తున్న జడ్జి జానకి

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి లోబడిన క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి కోరారు. శనివారం కోర్టులో పోలీసులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ చేయాలని సూచించారు. నగదుతోపాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమని, దీనిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా కేసులను సమీక్షించి తగిన సూచనలు చేశారు. సమావేశంలో వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీట్లు పంపిణీ

నగరి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఆర్కే రోజా పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం వైస్ ఎంపీపీ కన్నియప్పన్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని తడుకుపేట జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు, ప్రాథమిక పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కన్నియప్పన్ మాట్లాడుతూ ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించే పుట్టిన రోజు వేడుకల్లో పార్టీ క్యాడర్ అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంజీవిరెడ్డి, నాయకులు కోదండరెడ్డి, ముత్తువేలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్వీట్లు పంపిణీ


విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న కన్నియప్పన్

సారా తయారీ కేంద్రాలపై దాడులు

కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం మెరుపు దాడులు నిర్వహించి 1200 బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెదురుకుప్పం మండలంలోని యనమలమంద గ్రామ సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. శ్రీరంగరాజపురం మండలం మర్రిపల్లె గ్రామ సరిహద్దులో అక్రమంగా దాచి ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది సుందరం, పళణి, గుర్రప్ప, రామన్, హరిప్రసాద్, చంద్రమోహన్, పుల్లీబాయి, విజయ తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, మహిళను అరెస్టు చేసిన సంఘటన కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం మండలం నరసింహాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీ పవన్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం మండలంలో దాడులు నిర్వహించారు. నరసింహాపురం గ్రామంలో చేపట్టిన దాడుల్లో విలవనాథం భార్య అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకునానరు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మునిసుందరం, విజయకుమార్, రాజ్‌దీప్, గీత తదితరులు పాల్గొన్నారు.

నేడు వేరుశనగ విత్తనకాయల పంపిణీ

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం రాయితీపై వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి విజయకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలన్నారు. రాయితీ విత్తనం కోసం వచ్చే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జెరాక్స్ కాపీ తీసుకురావాలని సూచించారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్, ఎంపీటీసీ, మండల స్థాయి అధికారులకు శనివారం ఎంపీడీఓ బి.క్రిష్ణమహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వీధి దీపాలు, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరాఉ. ప్రజలకు కార్యదర్శులు అందుబాటులో ఉండాలని తెలిపారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్ప, ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్‌లు అయ్యప్ప, పుష్ప, శోభ, అనురేఖ, అమరావతి, మహేష్, నరసింహరాజు, జీవిత, మండల విస్తరణాధికారి రమేష్, వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్, పశువైద్యాధికారి యశస్వి, ఉపాధిహామీ ఏపీఓ మార్గరెట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, సంఘమిత్రాలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె


పుత్తూరులో ఆందోళన చేస్తున్న 108 సిబ్బంది

పుత్తూరు: సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు పుత్తూరు 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు స్పష్టం చేశారు. శనివారం 108 వాహనం వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ మాట్లాడుతూ సమ్మె నోటీసును రాష్ట్ర యూనియన్ తరఫున రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, అన్ని జిల్లాల కలెక్టర్లకు అందజేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను స్వయంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారులిచ్చిన హామీ మేరకు స్లాబ్ పద్ధతిలో అందరికీ వేతనాలు చెల్లించాలని కోరారు. సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 సిబ్బందిని నియమించాలని కోరారు. పైలట్లు, ఈఎంటీలకు ఇతర ఖాళీల్లో వారి అర్హతలను బట్టి వెయిటేజ్ ఇచ్చి నియామకాలు చేపట్టాలన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సహజ మరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీఓ ఎంఎస్ నెం.49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ.4 వేలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలన్నారు. 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో సమ్మె తప్పదని స్పష్టం చేశారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 108, 104 ఉద్యోగులు షణ్ముగం, సుధాకర్, తులసీరామ్, రాజేష్, కరుణాకర్‌రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.